చురక

అవార్డుల పేరు మార్పు
అంత ప్రభుత అభీష్టం
అన్నిట్లో రాజకీయ
ఆలోచనే కదా స్పష్టం.
దానిపైన ఎవరికైనా
దేనికింక భిన్న స్వరం
అనుకూలం ఉన్నోళ్లకే
అందుకదా దాని వరం

-వేల్పుల నారాయణ
9440433475



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 4-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:145 పేజీలు:6 వెల: రూ.1/-

## షబ్బీర్ అలీను కలిసి అభినందనలు తెలిపిన బీసీ కమిషన్ చైర్మన్



హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సలహాదారుడుగా పదవీ బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ అలీ షబ్బీర్ ను కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చం అందజేసి, అభినందనలు తెలుపుతున్న తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు.

## 'నేటినిజం' క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి) ఈరోజు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'నేటినిజం' దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, ప్రజాపోరు సంపాదకులు యూసుఫ్‌బాబు, ఖాన్, షాహిద్ పాల్గొన్నారు.

# ఎల్‌కే అద్వానీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'



న్యూఢిల్లీ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానం చేయనున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేయడం చాలా సంతోషంగా ఉందని ఎక్స్ వేదికగా ఆయన తెలిపారు. " భారత రత్న గౌరవం అందుకోబోతున్న ఎల్‌కే అద్వానీతో నేను మాట్లాడి అభినందనలు తెలిపాను. మన కాలంలో అత్యంత గౌరవనీయులైన రాజనీతిజ్ఞులలో ఆయన ఒకరు. దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. అద్వానీ జీవితంలో క్షేత్రస్థాయిలో పని చేయడం మొదలుపెట్టి ఉప ప్రధానమంత్రిగా దేశానికి సేవ చేసే అత్యున్నత స్థాయికి ఎదిగారు. మన హోంమంత్రిగా, ఐఅండ్‌బీ మంత్రిగా కూడా సేవలు అందించారు. పార్లమెంట్‌లో ఆయన అడుగులు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమైనవి, గొప్ప దూరదృష్టితో నిండి ఉన్నాయి" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.ఎల్‌కే అద్వానీకి భారతరత్న అవార్డును ప్రదానం చేయడం తనకు చాలా భావోద్వేగభరితమైన క్షణమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఎల్‌కే అద్వానీతో ఉన్న రెండు ఫొటోలను ప్రధాని షేర్ చేశారు. అద్వానీ దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో పారదర్శకత, సమగ్రతతో సేవలు అందించారని కొనియాడారు. తిరుగులేని నిబద్ధత, రాజకీయ నైతికతలతో ఆదర్శప్రాయమైన ప్రమాణాలను నెలకొల్పారని ప్రధాని మోదీ ప్రశంసించారు. జాతీయ ఐక్యత, సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం ఆయన అసమానమైన కృషి చేశారని ప్రశంసల జల్లు కురిపించారు. ఆయనతో మాట్లాడి, ఆయ నుంచి పాఠాలు నేర్చుకోవడానికి తనకు లెక్కలేనన్ని అవకాశాలు లభించడం ఎల్లప్పుడు గొప్ప అదృష్టంగా భావిస్తానని మోదీ చెప్పారు.

బీజేపీకి అత్యధిక కాలం అధ్యక్షుడిగా పనిచేసిన అద్వానీ

బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీ బీజేపీకి అత్యధికకాలం అధ్యక్షుడిగా పనిచేసిన ఘనత వహించారు. 1980లో పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి అత్యధిక కాలం అధ్యక్షుడిగా కొనసాగారు. ఇక అటల్ బిహారీ వాజ్‌పేయి సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చిన 90వ దశకంలో బీజేపీ ఎదుగుదల కోసం ఎల్‌కే అద్వానీ విశేష కృషి చేశారు. 2002-04 వరకు అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని మంత్రివర్గంలో ఉప ప్రధానిగా దేశానికి సేవలు అందించారు.

# 'భారతరత్న'పై తాను గర్వంగా అంగీకరిస్తున్నా.. అద్వానీ

న్యూఢిల్లీ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: 'భారతరత్న' పురస్కారం వరించడంపై మాజీ ఉప ప్రధాని, రాజనీతిజ్ఞుడు, బీజేపీ కురువృద్ధుడు లాల్ కృష్ణ అద్వానీ తొలిసారి స్పందించారు. అత్యంత వినమ్రత ,కృతజ్ఞతతో ప్రదానం చేసిన 'భారతరత్న'ని తాను గర్వంగా అంగీకరిస్తున్నానని అద్వానీ అన్నారు. ఇది ఒక వ్యక్తిగా తనకు దక్కిన గౌరవం మాత్రమే కాదని, జీవితాంతం శక్తి మేరకు సేవ చేయడానికి తాను అవలంభించిన ఆదర్శాలు, సూత్రాలకు కూడా దక్కిన గౌరవంగా భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. " నేను 14 సంవత్సరాల వయస్సులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో వాలంటీర్‌గా చేరిన నాటి నుంచి జీవితంలో నాకు అప్పగించిన ప్రతి పనినీ నాకు ఇష్టమైన దేశం కోసం అంకితభావంతో, నిస్వార్థంగా సేవ చేశాను. 'ఇదం న మమ్'(ఈ జీవితం నాది కాదు. నా జీవితం నా దేశం కోసం) నా జీవితాన్ని ప్రేరేపించింది".

"భారత రత్న దక్కిన సందర్భంగా నేను సన్నిహితంగా పనిచేసిన ఇద్దరు వ్యక్తులు- పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయిలను కృతజ్ఞతతో స్మరించుకుంటున్నాను. ప్రజాజీవితంలో, నా ప్రయాణంలో కలిసి పనిచేసిన లక్షలాది మంది నా పార్టీ కార్యకర్తలు, స్వయంసేవకులు, ఇతరులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నా కుటుంబ సభ్యులందరికీ, ముఖ్యంగా నా ప్రియమైన భార్య కమలకు ధన్యవాదాలు. వీరంతా జీవితంలో నాకు అండదండగా నిలిచారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. నాకు ఈ పురస్కారాన్ని అందించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. మన దేశం గొప్పతనం కీర్తి శిఖరాగ్రానికి పురోగమిస్తోంది" అంటూ ఎల్‌కే ప్రకటన విడుదల చేశారు.

# కరీంనగర్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి : మంత్రి పొన్నం ఆదేశాలు



కరీంనగర్, ఫిబ్రవరి 3: కరీంనగర్ పట్టణంలోని టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 14 నుంచి 21 వరకు జరిగే శ్రీ లక్ష్మి, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి ఇంటికి బ్రహ్మోత్సవాల వేడుకల ఆహ్వానం పత్రిక అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడ ఎటువంటి సమస్యలకు తావు లేకుండా సజావుగా బ్రహ్మోత్సవాలు జరగాలన్నారు. బ్రహ్మోత్సవాలలో ఆయా శాఖల అధికారులు వారి ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుగానే సమీక్షించుకోవాలని వెల్లడించారు.

14వ తేదీ నాటి అధ్యయనోత్సవం నుంచి 21 నాటి శోభాయాత్రలో ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. ఖచ్చితమైన ప్రోటోకాల్ ను పాటించాలని సూచించారు. సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

అంతకుముందు మార్కెట్ రోడ్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు రూ. 5 లక్షలను విరాళంగా అందించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయిన ఎల్‌కే అద్వానీ..

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఎల్‌కే అద్వానీ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ పేరు మార్మోగుతోంది. ఆయన సేవలకుగానూ దేశ అత్యున్నత పురస్కారం భారత రత్నను ప్రకటిస్తున్నట్లు కేంద్రం శనివారం వెల్లడించింది. ఎల్‌కే అద్వానీ పూర్తి పేరు లాల్ కృష్ణ అద్వానీ. కొన్ని దశాబ్దాలపాటు భారత దేశ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన ఆయన వయోభారంతో ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యారు. కానీ ఆయన దేశానికి చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోయాయి.

1998 నుండి 2004 వరకు, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నారు. ఆ సమయంలో అద్వానీ హోం మంత్రిగా తరువాత డిప్యూటీ ప్రధానమంత్రిగా పనిచేశారు. ఆయన 1927 నవంబర్ 8న కరాచీలో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) శ్రీ కిషించంద్ అద్వానీ, జ్ఞానీదేవి దంపతులకు జన్మించారు. ఎల్‌కే అద్వానీ కుటుంబం సింధీ హిందువుల శాఖకు చెందింది. ఆయన్ని ఇండియన్ పార్లమెంటరీ గ్రూప్ 1999లో అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డుతో ప్రదానం చేసింది. తాజాగా దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నఆయన్ని వరించింది.

అయోధ్య కోసం పోరాటం..

అయోధ్యలో(ంఎనీటష్ట్రఎజీ) రామ మందిర నిర్మాణానికి అడుగులు పడటంలో జరిగిన పోరాటంలో అద్వానీ కీలక పాత్ర పోషించారు. 90 వ దశకంలో రామమందిర ఉద్యమానికి అద్వానీ, మురళీ మనోహర్ జోషి నాయకత్వం వహించారు. ఎల్‌కే అద్వానీ నేతృత్వంలో 1990 లో గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి అయోధ్యలోని రామ జన్మభూమికి బీజేపీ రథయాత్రను ప్రారంభించింది. మందిర్ వహీ బనాయేంగే నినాదంతో అద్వానీ రామమందిర ఉద్యమాన్ని సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లారు. మురళీ మనోహర్ జోషి కూడా ఈ రథయాత్రలో కీలకంగా వ్యవహరించారు. ఈ రథయాత్రలో ప్రధాని మోదీ కూడా పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారం..

అద్వానీ కరాచీలోని సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. 1936 - 1942 వరకు అక్కడే చదువుకున్నారు. ఆయన 1947లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఖీూా) కార్యదర్శిగా నియమితులయ్యారు. దీంతో అప్పటి నుంచి సామాజిక సేవవైపు మళ్లారు. ఈ క్రమంలో ఆయన కుటుంబం రాజస్థాన్‌లోని మత్స్య - అల్వార్‌కు మకాం మార్చింది.

1. 1947లో అద్వానీ ఖీూా కరాచీ విభాగానికి కార్యదర్శిగా నియమితులయ్యారు.
2. 1951లో భారతీయ జనసంఘ్ సభ్యుడిగా మారారు. దీనిని శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్థాపించారు.
3 . 1966 నుంచి 1967 వరకు జన్ సంఘ్ నాయకుడిగా ఉన్నారు.
4. 1970 -1976 వరకు అద్వానీ ఢిల్లీ నుండి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు.
5. 1973లో జనసంఘ్ం అధ్యక్షుడిగా ఎంపికయ్యారు.
6. 1976 - 1982 వరకు గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు.
7. 1977లో జనసంఘ్ రద్దుతో దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయితో కలిసి జనతా పార్టీలో చేరారు.
8 . 1977 లోక్‌సభ ఎన్నికలలో జనతా పార్టీ విజయం సాధించింది. మొరార్జీ దేశాయ్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు.
9. జనవరి 1980 నుంచి ఏప్రిల్ 1980 వరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా పని చేశారు.
10 . 1980లో బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. 1986 వరకు ఆ పదవిలో కొనసాగారు.
11. 1982లో అద్వానీ 3వ సారి రాజ్యసభకు ఎన్నికయ్యారు.
12. 1986 - 1991 వరకు బీజేపీ అధ్యక్ష పదవిలో కొనసాగారు.
13. 1988లో 4వసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు.
14 . 1989లో లోక్‌సభ సభ్యుడయ్యారు.
15. 1989 - 1991 వరకు లోక్‌సభలో :ఏఖ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఉన్నారు.
16. 1990 -1991 వరకు లోక్‌సభ సెక్రటేరియట్ కమిటీలో చైర్మన్‌గా ఉన్నారు.
17. 1991లో రెండోసారి లోక్ సభకు ఎన్నికయ్యారు.
18. 1991 - 1993 వరకు సభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు.
19 . 1993 - 1998 వరకు మళ్లీ బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారు.
20 . 1998లో 12వ లోక్‌సభకు 3వసారి సభ్యుడిగా ఎన్నికయ్యారు.
21 . 1998 -1999 వరకు కేంద్ర హోం శాఖ మంత్రిగా పని చేశారు.
22. 1999లో లోక్‌సభకు 4వ సారి సభ్యుడిగా ఎన్నికయ్యారు.
23. అక్టోబర్ 1999 - మే 2004 వరకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిగా ఉన్నారు.
24. జూన్ 2002 - మే 2004 వరకు డిప్యూటీ పీఎంగా పని చేశారు.
25 . జులై 1, 2002 -ఆగస్టు 25, 2002 వరకు మరోశాఖకు మంత్రిగా పని చేశారు.
26. 2004లో లోక్‌సభకు 5వ సారి తిరిగి ఎన్నికై ప్రతిపక్ష పాత్ర వహించారు.
27. ఆగస్టు 5, 2006 - మే 2009 వరకు, ఒఐ అద్వానీ హోం వ్యవహారాల కమిటీలో సభ్యుడు.
28 . 2009లో 6వసారి 15వ లోక్‌సభకు ఎన్నికయ్యారు.
29. 2009లో మే నుంచి డిసెంబర్ నెల వరకు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు.
30. డిసెంబర్ 15, 2009న జాయింట్ పార్లమెంటరీ కమిటీలో సభ్యుడిగా మారారు.
31. జూన్ 10, 2013న అద్వానీ పదవులన్నింటికీ రాజీనామా చేశారు.

# ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం



హైదరాబాద్, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి) ఆదివారం సాయంత్రం ఏలూరులోని వైయంహెచ్‌ఎ హాలులో పద్మశ్రీ అవార్డు గ్రహిత ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు గుప్త ఫౌండేషన్‌వారు "కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం" ప్రదానం చేస్తున్నట్టు గుప్త ఫౌండేషన్ ఫౌండర్ యం. మోహనగుప్త తెలిపారు.

# ఏపీ తెలుగు భాషారత్న పురస్కారానికి బైస దేవదాసు ఎంపిక



హైదరాబాద్, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి) నేటినిజం సంపాదకులు, సీనియర్ జర్నలిస్ట్ బైస దేవదాసును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు సంఘం చైర్మన్ పి. విజయబాబు ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5న గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీలో జరిగే వేడుకల్లో పురస్కారాన్ని దేవదాసుకు బహూకరిస్తామని తెలిపారు.

# పంచాయతీలకు ప్రత్యేక అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలి

**-రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);సర్పంచుల స్థానంలో గ్రామ పంచాయతీలకు నియమించబడిన ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీ వ్యవస్థలో ఎలాంటి సమస్యలు లేకుండా పూర్తి బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ( సీతక్క )కోరారు.శనివారం ఆమె పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావుతో కలిసి ములుగు జిల్లా నుండి హాజరయ్యారు.ఇకపై గ్రామపంచాయతీలను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉందని, ముఖ్యంగా రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రత్యేక అధికారులు పని విషయంలో ఎక్కడ తగ్గొద్దన్నారు. ఈనెల 7 నుండి 15 వరకు గ్రామాలలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ డ్రైవ్ లో గ్రామంలో శానిటేషన్ తో పాటు, తాగునీరు, మౌలిక సదుపాయాలు, ఉపాధి హామీ తదితర కార్యక్రమాల పరిశీలన,సమస్యలతో పాటు, 15 న గ్రామ ప్రజలు,మహిళా సంఘాలు, యువకులతో సమావేశం ఏర్పాటు చేసి సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగించాలని కోరారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. అలాగే మహిళా సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి ఆదాయం వచ్చే మార్గాలను గుర్తించి వారు అభివృద్ధి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమంలో బాగా పనిచేసిన వారిని గుర్తించి జిల్లా కలెక్టర్ ద్వారా సన్మానించాలని అన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని చెప్పారు. గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన గ్రామాలలో అందుబాటులో ఉండాలని ఆమె కోరారు. హైదరాబాద్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లు ప్రత్యేక అధికారులకు వెంటనే ఒకరోజు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని, గ్రామాలలో పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ప్రత్యేక అధికారులందరూ గ్రామపంచాయతీ చట్టాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలని ,ప్రతి ఇంటికి మిషన్ భగీరథ తాగునీటి కనెక్షన్ ఉన్నది లేనిది సర్వే చేసి తెలుసుకోవాలని, జిల్లా కలెక్టర్ సైతం గ్రామాలను సందర్శించినప్పుడు పారిశుధ్యం ,తాగునీటిపై దృష్టి సారించాలని చెప్పారు. గ్రామాలలో నర్సరీలతో పాటు, సెగ్రిగేషన్ షెడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు సరిగా నిర్వహిస్తున్నది లేనిది చూసుకోవాలని, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు గ్రామంలో వీటన్నిటిపై సమీక్షించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులతో పాటు, పనిచేసే చోట సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ నెల 7 నుండి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ డ్రైవ్ ను చేపట్టాలని ,వేసవిలో తాగునీటికి ఎక్కడ ఇబ్బంది కలగకుండా మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రానున్న రెండు, మూడు నెలలు గ్రామపంచాయతీలపైనే ఎక్కువ దృష్టి సారించాలని, తాగునీటి వనరులన్నీ క్లోరిషన్ చేయాలని తెలిపారు. ఎక్కడైనా పైప్ లైన్లకు చిన్న చిన్న రిపేర్లు ఉంటే చేపట్టాలని ఆదేశించారు .ప్రతి ఇంటి ద్వారా చెత్త సేకరణ తో పాటు, ప్రతి గ్రామపంచాయతీని ప్లాస్టిక్ రహిత గ్రామపంచాయతీగా చేసే విషయంపై చర్యలు తీసుకోవాలని, మహిళా సంఘాల ద్వారా పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టించే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రత్యేకత పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి భాగస్వామ్యం చేయాలని అన్నారు.

# గ్రామాల అభివృద్ధితోనే ప్రజల జీవితాల్లో మార్పులు : మంత్రి దామోదర

మెదక్, ఫిబ్రవరి 3: గ్రామాల అభివృద్ధినే ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని టీ లింగంపల్లి, మర్పల్లి, ఆర్ ఇటిక్యాల, జగిర్యాల గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన దళిత కాలనీల్లో తాగునీరు, మురికి కాలువలు, విద్యుత్ స్తంభాల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ధరణి తీసివేసిన తర్వాత భూమి సమస్యలు తీర్చి, భూమిపై హక్కులు కల్పిస్తామన్నారు.

మానవతా దృక్పథంతో ఇద్దరు ఆడపిల్లలకు ఒక్కొక్కరికి రూ.50వేల ఇద్దరికీ డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారు. మెదక్ మండలం రేగొడులో కస్తూరీబా గాంధీ బాలిక విద్యాలయం, మోడల్ స్కూల్, కళాశాలలో జరిగిన సమావేశంలో దామోదర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆడపిల్లలకు చదువు ఆయుధమన్నారు. చదువుతో సంస్కారం అలవడుతుందన్నారు.

మంచి నడవడి, మంచి ఆలోచనలు చదువు ముఖ్యమన్నారు. చదువుకొని సమాజంలో బాధ్యతగా ఉండాలన్నారు. ప్రశ్నించడం అనేది చదువుతో వస్తుందన్నారు. మాతృభాషలో ప్రేమతో ఉండాలన్నారు. ఇతర భాషలను గౌరవించాలని, సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయాల కోసం రూ.85లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, డీఈఓ రాధా కిషన్, మెదక్ ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

# ఒక్క ప్రశ్నకు సమాధానం చెబితే మిగతా అన్నింటికి సమాధానం దొరుకుతుంది-మంత్రి కొండా సురేఖ



వరంగల్, ఫిబ్రవరి 3: కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నలు సంధించారని కానీ ఆమె ఒక్క ప్రశ్నకు సమాధానం చెబితే మిగతా అన్నింటికి సమాధానం దొరుకుతుందని తెలంగాణ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఇంద్రవెల్లి సభకు ఖర్చుపైనా, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రకటిస్తామని కాంగ్రెస్ ప్రకటించడంపైనా కవిత విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలపై కొండా సురేఖ స్పందించారు. తాను కవితను ఒక ప్రశ్న అడగదలుచుకున్నానని గతంలో భద్రాద్రి సీతారాములకు కేసీఆర్ మనవడు ఏ హోదాలో పట్టు వస్త్రాలు తీసుకెళ్ళాడు? అని నిలదీశారు. కేసీఆర్ సొంత డబ్బులతో వెళ్లారా అని ప్రశ్నించారు. ఈ ఒక్క ప్రశ్నకు సమాధానం చెబితే వీటన్నింటికి తాము చెబుతామన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎక్కడి నుంచి పోటీ చేసినా ప్రజలు ఓడించడం ఖాయమని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఇంద్రవెల్లి సభకు, సీఎం రేవంత్ రెడ్డి నిత్యం ఢిల్లీ వెళ్లడానికి అయిన ఖర్చులు ప్రభుత్వానివి కావా అని కవిత అడగడం విడ్డూరమన్నారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. వందల కోట్ల రూపాయలు పెట్టి సొంత ఫ్లైట్ ఎలా కొనుగోలు చేశారో చెప్పాలన్నారు.

అమెరికాలో అంట్లు తోముకునే వాళ్లు వచ్చి ఈ రోజు తెలంగాణలో దోచుకొని తిన్నారని ఆరోపించారు. ప్రజల సొమ్ము దోచుకుతిన్న మీకు మాట్లాడే హక్కు లేదన్నారు.

లిక్కర్ స్కాంలో ఇరుక్కొని లిక్కర్ రాణిగా మారారని కవితను ఉద్దేశించి విమర్శించారు. బీజేపీ కాళ్లపై పడి అరెస్ట్ కాకుండా తప్పించుకున్నారన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వసించారు కాబట్టే గెలిచామన్నారు. బీజేపీని, బీఆర్ఎస్‌ను తెలంగాణ వారు నమ్మలేదన్నారు. బీఆర్ఎస్ చేసిన మోసాలను ప్రజలు గుర్తించారన్నారు.

కవిత నిజామాబాద్ సహా ఎక్కడి నుండి ఎంపీగా పోటీ చేసినా ప్రజలు ఓడగొట్టి ఇంటికి పంపుతారని వ్యాఖ్యానించారు.

తాము తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉంటామని? బీఆర్ఎస్ నేతలకు మాత్రం కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు చిల్లర విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురించి కవిత మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ పదేళు పాలించినప్పుడు ఆయన గుర్తుకు రాలేదా అని నిలదీశారు.

నేటి కందం- నేటికి అందం

భారతమాతను గొలిచెడి
తీరుకు భయమొందినట్టి తెల్లటి ప్రభువుల్
భీరువులై విడిపించిరి
కారాగారమ్ము నుండి గాంధీ గారిన్

(4-2-1924 గాంధీ బ్రిటీషు చెరనుండీ విడుదల అయి నేటికి వంద సంవత్సరాలు )



-రాధశ్రీ
సెల్:9494481210

# భారత్‌ను విశ్వ గురువును చేసిన రామతత్వం

11 సెప్టెంబర్ 1893 రోజున చికాగోలో ప్రపంచ సర్వ మత సమావేశంలో హిందు భారత హృదయాన్ని ఆవిష్కరించిన స్వామి వివేకానంద ప్రసంగం తర్వాత అంతే ప్రాధాన్యాన్ని పొందిన తేదీగా 22 జనవరి 2024న అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ట ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అనాదిగా హిందువులను ఏకం చేసిన దారం, ప్రపంచ మత విశ్వాసాల సారం ఒక్కటే అనే బోధనల ఆధారం అన్నీ రామ తత్వమే, రామ రాజ్య సౌభాగ్యమే. 8000 ఏండ్ల అత్యంత పురాతన నాగరికతను స్వంతం చేసుకున్న హిందుత్వం "సర్వ మతాలకు అమ్మ (మదర్ ఆఫ్ ఆల్ రిలిజియన్స్)" లాంటిదని, బిలియన్ల జనాలను ఒక్కతాటిపై నిలిపిన శక్తివంతమైన సారం రామాయణం.

### రామతత్వం, రామ రాజ్యవిలువల పునాదులు:

నేడు దాదాపు 300 రకాల రామాయణాలు అందుబాటులో ఉన్నప్పటికీ అన్నింటి సారం రామతత్వమే, రాముడి బోధనలే. పరమత సహనం, మత విభేధాలను తిరస్కరించిన మతం, ప్రజాభిప్రాయాన్ని గౌరవించడం, సహజీవన సౌందర్యాన్ని బోధించిన తత్వం, అన్ని మత బోధనల సారం, శాంతియుత సమాజ స్థాపన, న్యాయ పోరాటాలు, సమానత్వ సాధనలు, బలహీనులకు బాసట నిలవడం అంటూ చక్కగా ప్రచారం చేసింది రసరమ్య రామాయణం. పెద్దలను గౌరవించడం, తల్లితండ్రుల్లో దైవాన్ని చూడడం, ప్రజాసంక్షేమానికి పెద్ద పీట వేయడం, అందరూ సమానమే అని నినదించడం, ఓర్పుకు పట్టం కట్టడం, ప్రేమను పంచడం, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించడం, అన్నదమ్ముల అనుబంధం లాంటి విలువల ప్రాధాన్యాలను ఏకరువు పెట్టింది మన రామాయణం, శ్రీ రాముడి జీవితం. ప్రతి సరైన ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వగలిగిన హిందూమతం భారతాన్ని విశ్వ గురువును చేస్తూనే శ్రీరాముడి బోధనలకు కట్టుబడి నేటికీ నడుస్తున్న పౌరసమాజం భారత్‌లోనే కాకుండా పలు ప్రపంచ దేశాల్లో కూడా అమలు అవుతున్నది. ప్రపంచ దేశాలు విభేదాలను మరిచి సమస్యలకు సమాధానాలు వెతికి మానవీయ సమాజాన్ని స్థాపించుకోవడానికి రామ రాజ్య సిద్ధాంతాలు ఉపకరిస్తాయని ప్రపంచ మానవాళి నమ్ముతోంది. అభ్యుదయ భావాలు, ఏకత్వ ప్రయోజనాలు, కరుణామయ జీవన విధానాలు, కుటుంబ విలువలు, మానవీయ సంబంధాలు, శత్రువులో మిత్రున్ని చూడడం, సత్య ధర్మాలకు కట్టుబడి ఉండడం, శిష్టరక్షణ – దుష్ట శిక్షణ చేసిన విధం, మాట మీద నిలబడడం, క్షమాగుణాలు, స్నేహ బలాలు, మానవ సంబంధాలు మొదలగు పదాలకు ప్రయోగాత్మక, ఆచరణాత్మక రుజువులను చూపి విశ్వ మానవాళికి దారి దీపంగా నిలుస్తున్నది.

### ప్రపంచ దృష్టిని ఆకర్షించిన బాలరాముడి ప్రాణ ప్రతిష్ట:

22 జనవరి 2024న మన ప్రధానమంత్రి చేతుల మీదుగా అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట క్షణాలు ప్రతి హిందు బంధువు మనసులో తిష్ట వేసి తాదాత్మ్యానికి లోను చేసింది. కోట్ల ప్రపంచ హిందువులకు పర్వదినంగా నిలిచిన 22 జనవరి 2024 రోజున నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం కూడా మన హృదయాలను పులకరింతలకు గురి చేస్తున్నది. ఐదు శతాబ్దాల కోరిక నిజరూపం దాల్చిన క్షణాలు అణువణువున, గడియ గడియన పండుగ సంబరాలను తెస్తూ, అన్ని మతాలకు ప్రేరణగా నిలుస్తూ, ప్రపంచ శాంతికి బాటలు వేస్తున్నది.

నేటి బాలరాముడు కొలువైన అయోధ్య కోవెల హిందూ మానవాళికి దారి దీపం అవుతుందని, భారత సంస్కృతి వారసత్వ సంపదలు మహోన్నతమైనవని విశ్వ మానవాళి తెలుసుకుంటున్న శుభ సందర్భంగా ప్రతి హిందు బంధువుకు శుభాకాంక్షలను తెలియజేద్దాం, రామ్‌లల్లాకు జేజేలు పలుకుదాం.

### ఆధునిక వాటికన్ సిటీగా మారిన బాలరాముడి అయోధ్య:

ఆధునిక వాటికన్ సిటీగా అవతరించిన అయోధ్య రామ మందిరం రానున్న వేల ఏండ్లకు ప్రపంచానికే మార్గనిర్ధేశనం చేయడానికి ఉవ్విళ్లూరుతున్నది. ముస్లిమ్ మెజారిటీ కలిగిన ఇండోనేషియాలో రామ పూజలు, రామాయణ ప్రచారాలు జరుగుతూనే ఉన్నాయి. వాషింగ్టన్, న్యూయార్క్, ప్యారిస్, సిడ్నీ, లండన్ వీధులు సహితం రామనామంతో ప్రతిధ్వనించాయి. యుద్ధాలు వద్దంటూనే పరమత సహనంతో శాంతి గొడుగుల కింద సంతోషకర సమాజం కొనసాగాలని బోధించిన రాముడి ప్రతి మాట జీవితాన్ని సన్మార్గంలో నడిపే మంత్రం అవుతున్నది. రామ రాజ్యమే ప్రపంచ దేశాల ముందున్న ఏకైక మార్గమని తెలుసుకొని విశ్వ మానవాళి మానవీయ విలువలకు పట్టాభిషేకం చేస్తూ శాంతి కపోతాలు ప్రపంచమంతా స్వేచ్ఛగా ఎగిరే విధంగా నడుచుకుందాం, ఆనందమయ జీవితాలను ఆశ్వాదిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# 2024 జనవరి నాటికి 1297.38 ఎంటీ సరుకులు రవాణా చేసిన భారత రైల్వే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:2023 ఏప్రిల్– 2024 జనవరి మధ్య కాలంలో భారతీయ రైల్వే 1297.38 ఎంటీ సరుకులు రవాణా చేసింది. గత ఏడాది ఇదే కాలంలో రైల్వే ద్వారా 1243.46 ఎంటీ సరుకులు రవాణా అయ్యాయి.

గత ఏడాదితో పోల్చి చూస్తే 2023 ఏప్రిల్– 2024 జనవరి మధ్య కాలంలో సరుకు రవాణా 53.42 ఎంటీ పెరిగింది. 2023 ఏప్రిల్–2024 జనవరి మధ్య కాలంలో సరుకుల రవాణా ద్వారా 140623.4 కోట్ల రూపాయల ఆదాయం రైల్వేకు సమకూరింది. గత ఏడాది ఇదే కాలంలో సరుకు రవాణా ద్వారా రైల్వేకు 135388.1 కోట్ల రూపాయల ఆద్యం వచ్చింది. గత ఏడాదితో పోల్చి చూస్తే రైల్వే ఆదాయం దాదాపు 5235.30 కోట్ల రూపాయలు పెరిగింది.

2024 జనవరి నెలలో 142.70 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా జరిగింది. 2023 జనవరిలో 134.07 మెట్రిక్ టన్నుల సరుకులు రవాణా అయ్యాయి. 2024 జనవరి లో గత సంవత్సరంతో పోలిస్తే సరుకుల రవాణా సుమారు 6.43% పెరిగింది.

2023 జనవరి లో సరుకుల రవాణా ద్వారా రూ.14908.82 కోట్ల ఆదాయం వచ్చింది. , 2024 జనవరి లో రూ.15514.82 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాదితో పోలిస్తే ఆదాయం 4.06 శాతం వృద్ధిని కనబరిచింది.

2024 జనవరి లో 71.45 మెట్రిక్ టన్నుల బొగ్గు, 17.01 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం, 6.07 మెట్రిక్ టన్నుల పిగ్ ఐరన్ ఉక్కు ఉత్పత్తులు, 7.89 మెట్రిక్ టన్నుల సిమెంట్ ( క్లింకర్ కాకుండా ),5.52 మెట్రిక్ టన్నుల క్లింకర్, 4.53 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు, 5.27 మెట్రిక్ టన్నుల ఎరువులు, 4.31 మెట్రిక్ టన్నుల మినరల్ ఆయిల్, కంటైనర్లలో 10.20 మెట్రిక్ టన్నుల సరుకులు,ఇతర సరుకులు రైల్వే ద్వారా రవాణా అయ్యాయి.

''హంగ్రీ ఫర్ కార్గో'' అనే విధానాన్ని అనుసరిస్తున్న రైల్వే శాఖ వ్యాపారాన్ని సులభతరం చేయడానికి, పోటీ ధరలలో సేవలను మెరుగు పరచడానికి నిరంతర ప్రయత్నాలు చేస్తోంది. వినియోగదారుల అవసరాల మేరకు కేంద్రీకృత విధానం ,వ్యాపార అభివృద్ధి యూనిట్ల సహకారంతో చురుకైన విధాన రూపకల్పన ద్వారా రైల్వే శాఖ ప్రగతి పట్టాలపై పరుగులు తీస్తోంది.

# సముద్రపు దొంగలు హైజాక్ చేస్తున్న నౌకలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:గత మూడేళ్ళలో సముద్రపు దొంగలు ఏడు నౌకలను సముద్రంలోనే హైజాక్ చేసిన ఘటనలు నమోదయ్యాయి. వాణిజ్య నౌక – లైలా నార్‌ఫోక్ హైజాక్ ఘటన ఇందులో ఒకటి. జనవరి 04–05, 2024న చోటు చేసుకున్న ఈ నౌకలో 15మంది భారతీయులు సహా మొత్తం 21మంది సిబ్బంది ఉన్నారు. తర్వాత, చేపలు పట్టే నౌక – ఇమాన్ (ఎఓంబె)ను జనవరి 28, 2024న ఉ మరొక చేపలు పట్టే మరొక నౌక అల్ నీమి (ఒఎ ఔజీవవఎతి)ని జనవరి 29, 2024న హైజాక్ చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. కాగా, వీటిలో భారతీయ సిబ్బంది లేరు.

భారత నావికాదళం సముద్ర భద్రతను ప్రోత్సహించడానికి ప్రాంతీయ, అదనపు ప్రాంతీయ నావికాదళాలు/ సముద్ర బలగాలతో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది.

2008 నుంచి భారతీయ నావికాదళం గల్ఫ్ ఆఫ్ ఈడెన్, ఆఫ్రికాలోని తూర్పు తీరంలో సముద్ర దొంగతనాలను నిలువరించేందుకు గస్తీ కోసం యూనిట్లను మొహరించింది. ఇప్పటివరకూ 3,440 నౌకలు, 25వేల మందికి పైగా నావికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. ఈ ప్రాంతంలో సముద్ర తీర భద్రతను పునరుద్ధరించేందుకు, నౌకల ఉనికిని పెంచడం, సముద్ర గస్తీ విమానం ద్వారా నిఘా/ మధ్య అరేబియా సముద్రంలోనూ, సోమాలియా తూర్పు తీరంలో రిమోట్‌గా పైలట్ చేసిన విమానాలను భారత నావికాదళం చేపట్టింది. అరేబియా సముద్రంలో ఉ గల్ఫ్ ఆఫ్ ఈడెన్ / పొరుగు ప్రాంతాలలో తిరుగుతున్న వాణిజ్య నౌకలలో భారతీయ సిబ్బంది గురించిన వివరాల కోసం డిజి (షిప్పింగ్)తో, జాతీయ, అంతర్జాతీయ సముద్ర భద్రతా ఏజెన్సీలతో సమన్వయపూరిత రీతిలో తక్షణ స్పందన, సమర్ధవంతమైన అనుసంధానం, సహకారం కోసం సమాచార మార్పిడి. దీనికి అదనంగా, ఈ ప్రాంతంలో సముద్ర భద్రత కోసం ఈ ప్రదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చేపలు పట్టే నౌకలు / పడవలను భారతీయ నావికాదళం ప్రశ్నిస్తోంది.

ఈ ప్రాంతంలో సముద్ర భద్రతను పునరుద్ధరించే దిశగా మధ్య అరేబియా సముద్రంలో, సోమాలియా తీరానికి తూర్పున నౌకల ఉనికిని, సముద్ర గస్తీ విమానం / రిమోట్ పైలట్ చేసిన విమానాల ద్వారా వైమానిక నిఘాను భారతీయ నావికాదళం పెంచి, మెరుగుపరిచింది. పాక్ స్ట్రెయిట్‌లో ఎటువంటి సముద్రపు దొంగతనాలకు సంబంధించిన ఘటనలూ నమోదు కాలేదు.

లోక్‌సభలో శ్రీ ఎ. గణేశమూర్తి అడిగిన ప్రశ్నకి లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తూ రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్‌భట్ ఈ సమాచారాన్ని వెల్లడించారు.

# అనంత పోలీసుల సరికొత్త రికార్డు.. ఏకంగా 8309 సెల్ ఫోన్ల రికవరీ..





అనంతపురం , ఫిబ్రవరి 3: దొంగలపాలైన సెల్ ఫోన్లను రికవరీ చేసి.. బాధితులకు అప్పజెప్పటంలో అనంతపురం పోలీసులు దేశంలోనే అగ్ర స్థానంలోనిలిచారు. రూ. 56 లక్షల విలువ చేసే 305 సెల్ ఫోన్లను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శనివారం బాధితులకు అందజేశారు. వీటిల్లో 271 పోగొట్టుకున్నవి కాగా? 34 అపహరణకు గురైన మొబైల్ ఫోన్లు ఉన్నాయి. ఇప్పటి వరకూ 8309 సెల్ ఫోన్లు రికవరీ చేశారు. వీటన్నింటి విలువ సుమారు రూ. 13.67 కోట్లు ఉంటుందని అంచనా. జిల్లాలో ప్రజల మొబైల్ ఫోన్లను తస్కరించి ఇతర రాష్ట్రాలకు తరలించినా రికవరీలో రాజీ పడకుండా పోలీసులు దొంగలపనిపట్టారు. శనివారం ఎనిమిది జిల్లాల బాధితులకు సెల్ ఫోన్లు అందజేశారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు తరలించిన ఫోన్లనూ రికవరీ చేయించారు.

చోరీకి గురైతే ఇలా చేయండి..

ఫోన్ చోరీకి గురైనా మిస్ అయినా చాట్ బాట్ లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీఈఐఆర్ లో నమోదు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. సీఈఐ ఆర్ లో ఎలా నమోదు చేసుకోవచ్చో చాట్ బాట్ లో సూచనలు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వెంటనే సిమ్, ఐ ఎం ఈ ఐ నంబర్లను బ్లాక్ చేస్తారు. దీనివల్ల సదరు మొబైల్ నంబర్ , మొబైల్ ఫోన్ లో ఉన్న విలువైన సమాచారం దుర్వినియోగం కాకుండా ఉండే వీలు ఉంటుంది. జిల్లా పోలీస్ సైబర్ విభాగం సీఐ షేక్ జాకీర్ సిబ్బందిని అభినందించడమే కాకుండా సెల్ ఫోన్ల రికవరీలో మంచి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. బిల్లు లేకుండా సెల్ ఫోన్ అమ్ముతామంటు నమ్మబలికే వ్యక్తులు సెల్ ఫోన్ దుకాణాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, తదితర ప్రాంతాలలో అనుమానాస్పదంగా సంచరించే వారిపై సమీపంలోని పోలీసు స్టేషన్ కు లేదా జిల్లా ఎస్పీ మొబైల్ ఫోన్ 9440796800 కు సమాచారం చేరవేయాలని జిల్లా ఎస్పీ తన ఫోను నంబర్ను వెల్లడించారు.

# సైబర్ నేరస్తుల భరతంపట్టిన పోలీసులు.. రూ.లక్షలు డ్రా చేసిన ఇద్దరు అరెస్టు





అనంతపురం, ఫిబ్రవరి 3: : అనంతపురం జిల్లా పోలీసులు సైబర్ నేరస్తుల భరతం పడుతున్నారు. జిల్లా ఎస్పీ అనుబురాజన్ నేతృత్వంలోని పోలీసు బృందాలు దీనిపై తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్తులను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేస్తున్నారు. అనంతపురంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైబర్ సెల్ టీం ఈ నేరాల పరిశోధనకు విశేష కృషి చేస్తోంది.

తాజాగా బీహార్ కు చెందిన ఇద్దరు సైబర్ నేరస్తులను శనివారం జిల్లా ఎస్పీ అరెస్టు చేయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు మంజూరు చేస్తున్న పథకాల విషయంలో సులభంగా డబ్బును డ్రా చేసుకునేందుకు (ఆధార్ ఎనేబుల్ ) ద్వారా వేలిముద్రవేసి డబ్బు డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీన్ని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరస్తులు అనంతపురం జిల్లాలోని గుత్తి మండలంలో 50 మంది లబ్ధిదారుల నుంచి డబ్బు డ్రా చేసుకున్నారు.

దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో బీహార్ రాష్ట్రం పూర్నియా జిల్లా మహారాజపూర్ కు చెందిన 34ఏళ్ల నూర్ ఇస్లాం, పూర్ణియా జిల్లాకు చెందిన మహమ్మద్ ఇస్రాఫీల్ లను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరు దేశవ్యాప్తంగా 300మందికి పైగా బాధితుల నుంచి రూ.39, 48, 304 లను కాజేశారు. దీని మీద గుత్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని ఇద్దరిని అరెస్టు చేయగా.. మరో నిందితుడు బబురుద్దీన్ పరారీలో ఉన్నాడు. ఈ ముఠా వ్యవహారం గురించి గుత్తి పోలీస్ స్టేషన్ లో 308/2023 కేసు నమోదైందని తెలిపారు. జమ్మూ కాశ్మీర్ ఉత్తరప్రదేశ్ రాజస్థాన్ తమిళనాడు తదితర ప్రాంతాల్లో కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసిన పోలీసులకు అభినందనలు తెలిపారు.

# జూరాల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే ధర్నా.. కేఆర్ఎంబీకి బాధ్యతలు అప్పగించవద్దని డిమాండ్



జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాల నిర్వహణ బాధ్యతలను కేంద్ర జలవనరుల శాఖకు కృష్ణా రివర్ బోర్డు మేనేజ్మెంట్ బోర్డుకుఅప్పగించడంపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డితీవ్ర నిరసన తెలిపారు. శనివారం జూరాల ప్రాజెక్టు రోడ్డుపై బైఠాయించి బీఆర్ఎస్ నాయకులు, అనుచరులతో కలిసి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో గద్వాల నియోజకవర్గంలోని కృష్ణ నది పరివాహక ప్రాంతాల చెరువులు ఎండిపోవడంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎడారిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం కోసం పాలమురు జిల్లాను ఎడారిగా మార్చబోతున్నాడని దుయ్యబట్టారు.

పాలమూరుకు చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిని అడ్డుకోకపోవడం దురదృష్టకరమని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రైతుల పక్షాల ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కృష్ణాజిలాల నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# క్రీడల పట్ల ప్రభుత్వ స్ఫూర్తి మైదానంలో క్రీడాకారుల స్ఫూర్తితో ప్రతిధ్వనిస్తుంది-ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు వీడియో సందేశం ద్వారా పాలీ సన్సద్ ఖేల్ మహాకుంభ్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. తమ అద్భుతమైన క్రీడా ప్రతిభను ప్రదర్శించినందుకు పాల్గొన్న వారందరినీ అభినందిస్తూ ప్రధాన మంత్రి, "క్రీడల్లో ఎప్పుడూ ఓటమి ఉండదు; మీరు గెలుస్తారు లేదా నేర్చుకుంటారు. అందువల్ల, ఆటగాళ్లందరికీ మాత్రమే కాకుండా అక్కడ ఉన్న వారి కోచ్‌లు మరియు కుటుంబ సభ్యులకు కూడా నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ యువత, దేశాభివృద్ధిలో క్రీడల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అతను ఇలా అన్నాడు, "సంసద్ ఖేల్ మహాకుంభ్‌లో కనిపించిన ఉత్సాహం మరియు విశ్వాసం నేడు ప్రతి క్రీడాకారుడు మరియు ప్రతి యువకుడికి గుర్తింపుగా మారింది. క్రీడల పట్ల ప్రభుత్వ స్ఫూర్తి మైదానంలో క్రీడాకారుల స్ఫూర్తితో ప్రతిధ్వనిస్తుంది." అటువంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహించడంలో ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న నిరంతర కృషిని ఎత్తిచూపిన ప్రధాన మంత్రి, జిల్లాలు మరియు రాష్ట్రాలలో ఉన్న లక్షలాది మంది ప్రతిభావంతులైన క్రీడాకారులకు సన్సద్ ఖేల్ మహాకుంభ్ వేదికను కల్పిస్తోందని అన్నారు. కొత్త మరియు రాబోయే ప్రతిభను స్కౌట్ చేయడానికి మరియు ఉపయోగించుకోవడానికి ఇది ఒక మాధ్యమంగా మారిందని ఆయన అన్నారు. ముఖ్యంగా మహిళలకు అంకితమైన పోటీల నిర్వహణ గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు.

ఇంకా, సన్సద్ ఖేల్ మహాకుంభ్‌లో పాలీకి చెందిన 1100 మందికి పైగా పాఠశాల విద్యార్థులతో సహా 2 లక్షల మందికి పైగా అథ్లెట్లు పాల్గొనడాన్ని ప్రధాని మోదీ అభినందించారు. ఈవెంట్ ద్వారా ఈ అథ్లెట్లకు అందించిన అసాధారణమైన ఎక్స్‌పోజర్ మరియు అవకాశాన్ని అతను గుర్తించాడు. పాలీ పార్లమెంటు సభ్యుడు శ్రీ పి.పి.కి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. చౌదరి, అతని అత్యుత్తమ ప్రయత్నాలకు.రాజస్థాన్ మరియు దేశం యొక్క యువతను రూపొందించడంలో క్రీడల యొక్క కీలక పాత్రను నొక్కిచెప్పిన ప్రధాని మోదీ, "రాజస్థాన్ యొక్క ధైర్యవంతులైన యువత సాయుధ దళాలలో వారి సేవ నుండి క్రీడలలో వారి విజయాల వరకు నిరంతరం దేశానికి కీర్తిని తెచ్చిపెట్టారు. క్రీడాకారులైన మీరు ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తారని నాకు నమ్మకం ఉంది.క్రీడల పరివర్తన శక్తిని ఎత్తిచూపుతూ, ప్రధాన మంత్రి ఇలా వ్యాఖ్యానించారు, "క్రీడల అందం కేవలం గెలుపే అలవాటును పెంపొందించుకోవడంలోనే కాదు, స్వీయ– అభివృద్ధి కోసం నిరంతరాయంగా కొనసాగించడంలో కూడా ఉంది. శ్రేష్ఠతకు పరిమితి లేదని క్రీడలు మనకు నేర్పుతాయి మరియు మనం మన శక్తితో పోరాడాలి.క్రీడల యొక్క గొప్ప బలాలలో ఒకటి యువతను వివిధ దురాచారాల నుండి దూరం చేసే సామర్థ్యం అని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. క్రీడలు దృఢత్వాన్ని కలిగిస్తాయి, ఏకాగ్రతను పెంపొందిస్తాయి మరియు మనల్ని ఏకాగ్రతగా ఉంచుతాయి. అందువల్ల, వ్యక్తిగత అభివృద్ధిలో క్రీడలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి."

యువజన సంక్షేమానికి ప్రభుత్వ నిబద్ధతను నొక్కిచెప్పిన ప్రధాని మోదీ, "ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో లేదా కేంద్ర స్థాయిలో ఉన్నా యువత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తోంది. అథ్లెట్లకు మరిన్ని అవకాశాలను అందించడం, ఎంపిక ప్రక్రియల్లో పారదర్శకతను నిర్ధారించడం మరియు వనరులను కేటాయించడం ద్వారా ప్రభుత్వం భారతీయ అథ్లెట్లకు గొప్ప మద్దతునిచ్చింది.గత దశాబ్దంలో క్రీడా బడ్జెట్‌లో మూడు రెట్లు పెరుగుదల, ఖాఖా సహా వివిధ పథకాల కింద వందలాది మంది క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందించడం మరియు దేశవ్యాప్తంగా అనేక క్రీడా కేంద్రాల ఏర్పాటును ప్రధాని మోదీ హైలైట్ చేశారు. ఖేలో ఇండియా గేమ్స్ కింద 3,000 మందికి పైగా అథ్లెట్లకు నెలకు రూ. 50,000 సహాయం అందిస్తున్నట్లు ప్రధాన మంత్రి తెలియజేశారు. అట్టడుగు స్థాయిలో, దాదాపు 1,000 ఖేలో ఇండియా కేంద్రాల్లో లక్షల మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో 100కు పైగా పతకాలతో సరికొత్త రికార్డును నెలకొల్పిన భారత అథ్లెట్లను ఆయన ప్రశంసించారు. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో యువత దృష్టిని ఆయన నొక్కి చెప్పారు. "రోడ్లు మరియు రైల్వేలు వంటి ఆధునిక మౌలిక సదుపాయాలపై 11 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి యువతకు ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుంది. 40,000 వందే భారత్ తరహా బోగీల ప్రకటన, ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కార్యక్రమాల వల్ల మన యువతే అత్యధికంగా లబ్ధి పొందుతున్నారు" అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఉపాధి అవకాశాలను సృష్టించడం, వ్యవస్థాపకతను పెంపొందించడం మరియు క్రీడలతో సహా వివిధ రంగాలలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల ద్వారా యువత సాధికారతపై ప్రభుత్వం దృష్టిని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు.

# భద్రాచలం రోడ్-డోర్నకల్ డబుల్ లైన్‌కు సౌత్ సెంట్రల్ రైల్వే గ్రీన్ సిగ్నల్..

ఖమ్మం, ఫిబ్రవరి 3:భద్రాచలం రోడ్డు–డోర్నకల్ మధ్య డబుల్ లైన్ ఏర్పాటుకు దక్షిణ మధ్య రైల్వే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.770.12 కోట్లతో ఈ విభాగాన్ని విస్తరించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. కేంద్ర బడ్జెట్‌లో ఈ లైన్‌కు రూ.100 కోట్ల నిధులు కేటాయించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

కొన్ని నెలల క్రితం రైల్వే శాఖ ఈ ప్రాజెక్టును.. వికారాబాద్, విష్ణుపురం స్టేషన్లకు బైపాస్ లైన్లను మంజూరు చేసింది. నల్గొండ జిల్లా విష్ణుపురం రైల్వే స్టేషన్ సమీపంలోని దామరచర్లలో ప్రస్తుతం 4 వేల మెగావాట్ల సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సింగరేణి గనుల నుంచి తెప్పించనున్నారు. అందులో భాగంగా సింగిల్ లైన్ గా ఉన్న భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం)–డోర్నకల్, మోటమర్రి–విష్ణుపురం సెక్షన్లను విస్తరించేందుకు దక్షిణ మధ్య రైల్వే గతేడాది సర్వే పూర్తి చేసింది. ఇందులో భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం)–డోర్నకల్ రెండో లైన్ పనులకు రైల్వే మంత్రిత్వ శాఖ గతేడాది ఆమోదం తెలిపింది.

తాజా మధ్యంతర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వికారాబాద్‌లో 2.8 కి.మీ, విష్ణుపురంలో 4.9 కి.మీ మేర బైపాస్ లైన్లు నిర్మించనున్నారు. దీంతో ఆయా స్టేషన్లలోకి వెళ్లకుండా బయటి నుంచి గూడ్స్ రైళ్లు బయలుదేరుతున్నాయి. రూట్ మార్చే ప్యాసింజర్ రైళ్లకు ఇంజన్ మార్చే సమస్య ఉండదు. తద్వారా ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణించే వారికి సమయం కలిసి వస్తుంది. శంషాబాద్–విజయవాడ–విశాఖపట్నం, విజయవాడ–కర్నూలు సెమీ హైస్పీడ్ కారిడార్‌ల పెట్ సర్వే మార్చిలో పూర్తవుతుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ కారిడార్లలో గంటకు 220 కి.మీ వేగంతో రైళ్లు ప్రయాణిస్తాయని తెలిపారు. చర్లపల్లి టెర్మినల్ త్వరలో పూర్తికావడంతో సికింద్రాబాద్ స్టేషన్ పై ఒత్తిడి తగ్గుతుందన్నారు. దక్షిణ మధ్య రైల్వేకు కేంద్ర బడ్జెట్‌లో రూ.14,232.84 కోట్లు కేటాయించామని.. గతేడాది కేటాయించిన మొత్తం రూ.13,786.19 కోట్లకుపైగా ఉందన్నారు.

# శిరోముండన బాధితురాలికి ఎమ్మెల్యే జక్కంపూడి పరామర్శ



రాజమండ్రి , ఫిబ్రవరి 3: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో భర్త చేతిలో శిరోముండనానికి గురైన బాధితురాలి షేక్ ఆషా ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు.. రాజమండ్రి ప్రభుత్వ హాస్పటల్లో చికిత్స పొందుతున్న ఆమె వద్దకు నేడు ఆయన వెళ్లారు.. బాధితురాలికి ఆయన ధైర్యం చెప్పారు.. నిందితుడిని కఠినంగా శిక్షిస్తానని ఆయన హామీ ఇచ్చారు.. ఘటన జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.కేసు వివరాలలోకి వెళితే పెదకొండేపూడికి చెందిన కర్రి రాంబాబు అలియాస్ అభిరామ్ హైదరాబాద్ లో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేసేవాడు. నెల్లూరుకు చెందిన జూనియర్ ఆర్టిస్టు షేక్ ఆషా(26)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారి ఇద్దరూ ఆరేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. ఏడాది తర్వాత కుమారుడు పుట్టగా అప్పటినుంచి రాంబాబు ముఖం చాటేశాడు. అతనిపై ఆషా ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదుచేశారు. రాంబాబు తల్లిదండ్రులు వెళ్లి ఆషాను ఒప్పించి ఆ కేసు ఉపసంహరించుకోవాలని, ఆమెను పెదకొండేపూడి తీసుకొచ్చారు.రాంబాబు కూడా వచ్చేసి పోలవరం ప్రాజెక్టులో ఓ అధికారి వద్ద కారు డ్రైవర్గా కుదిరాడు. కొంతకాలం కాపురం సజావుగానే సాగింది. నాలుగేళ్ల క్రితం భార్యను బయటకు గెంటేశాడు. భర్త, అత్తమామలపై ఆమె వర కట్న వేధింపుల కేసు పెట్టడంతో సీతానగరం పోలీసులు కేసు నమోదుచేశారు. పెదకొండేపూడి గిరిజనుల ఆశ్రయంలోనే కొన్నాళ్లపాటు ఆషా ఉన్నారు. అనంతరం హైదరాబాద్ వెళ్లి అక్కడ పని చేసుకుంటున్నారు. భర్తకు రెండో పెళ్లి చేస్తున్నారని తెలిసి రెండు నెలల క్రితం బిడ్డను తీసు కుని సీతానగరం వచ్చి న్యాయం కోసం పోరాడుతున్నారు. రాంబాబుతో పాటు అత్తమామలపై పెట్టిన 498(ఎ) కేసును ఉపసంహరించుకుంటేనే కాపురం ఉంటుందని.. లేకుంటే ఆస్తి, ఇంటిని కూడా రాంబాబు సోదరికి రాయిం చేస్తామని మండలస్థాయి పా నేతలు బెదిరించారని బాధితురాలు వాపోయారు.

భర్తకు రెండో పెళ్లి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసి నాలుగు రోజుల క్రితం అత్తింటికి బిడ్డతో చేరుకున్నారు. అత్తమామలు తమ కుమారుడికి సమాచారం అందించారు. రాంబాబు శుక్రవారం ఉదయం ఇంటికొచ్చి భార్యను గదిలో బంధించాడు. ఆమె నడు ముపై కూర్చొని ట్రిమ్మర్తో శిరోముండనం చేశాడు.. కిటికీలోంచి ఓ వ్యక్తి చూసి ప్రశ్నించగా లోపలికి వస్తే ఆమె గొంతు కోస్తానని బెదిరించాడు. వేరుచేసిన జుట్టును ఒక చేత్తోనూ, ఆమెను మరో చేత్తోనూ పట్టుకుని ఈడ్చుకుంటూ బయటకు వచ్చి ఆ వీధిలో తిప్పాడు.

**తిరుపతిలో గుండు గీయించుకున్నానని చెప్పు..**

ఎవరైనా అడిగితే తిరుపతి వెళ్లి గుండు గీయించుకు న్నానని చెప్పాలంటూ రాంబాబు భార్యను హెచ్చరించాడు. వేరుచేసిన జుట్టును భుజంపై వేసుకుని.. వీడి యోలు తీస్తున్నవారిని బెదిరించి కారులో వెళ్లిపో యాడు. సమాచారం అందడంతో పోలీసులు బాధితురాలిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదుచేశామని ఎస్సై టి. రామకృష్ణ తెలిపారు.

# జోర్డాన్‌లోని అమెరికా సైనిక క్యాంప్‌పై దాడికి ప్రతిగా అమెరికా దాడులు

**-సిరియాలో 18 మంది మిలిటెంట్ల.. ముగ్గురు అమెరికా సైనికులు మృతి**

వాషింగ్టన్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఇటీవల జోర్డాన్ లో తమ క్యాంప్‌పై దాడి చేసిన ఘటనకు ప్రతిగా అమెరికా దాడులు మొదలు పెట్టింది. ఇరాక్, సిరియాలోని ఇరాన్ రెవల్యూషనరీ గార్డుల మద్దతు కలిగిన 85కుపైగా మిలీషియా స్థావరాలే లక్ష్యంగా అమెరికా యుద్ధవిమానాలు దాడులు చేశాయి.

దీంతో సిరియాలో 18 మంది మిలిటెంట్లు మృతి చెందారు. మిలిటెంట్లకు చెందిన కమాండ్ కంట్రోల్ ప్రధాన కేంద్రంతోపాటు ఇంటెలిజెన్స్ కేంద్రాలు, రాకెట్లు, క్షిపణులు, డ్రోన్లు, ఆయుధ సామాగ్రి నిల్వల గోడౌన్లు, లాజిస్టిక్స్ సౌకర్యాలపై దాడులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. జోర్డాన్‌లోని అమెరికా సైనిక క్యాంప్‌పై ఇటీవల డ్రోన్ దాడి జరిగిన విషయం తెలిసిందే. ఇందులో ముగ్గురు అమెరికా సైనికులు మృతిచెందగా, సుమారు 40 మంది గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈ దాడులు జరిగినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. అమెరికన్లకు ఎవరైనా హాని కలిగిస్తే, తాము తగిన సమాధానం ఇస్తామని ఈ దాడుల తరువాత అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆదివారం జోర్డాన్‌లో ఇరాన్ మద్దతుగల ఉగ్రవాద గ్రూపులు జరిపిన డ్రోన్ దాడిలో ముగ్గురు అమెరికా సైనికులు మరణించారని ఆయన చెప్పారు.

# ఈనెల 6న అసెంబ్లీ ముట్టడిస్తాం..



కడప, ఫిబ్రవరి 3: సర్పంచులు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి చులకన భావం ఏర్పడిందని, అందుకే పార్టీలకు అతీతంగా ఈనెల 6వ తేదీన చలో అసెంబ్లీ.. ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ పంచాయతీ రాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచులు అందరూ జయప్రదం చేయాలని కోరారు.

శనివారం కడపలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు, రాష్ట్ర ఉన్నతాధికారులకు సర్పంచులు అంటే చిన్నచూపు ఏర్పడిందని, పంచాయతీ రాజ్ వ్యవస్థపై వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను ఇతర పద్దుల కింద వాడుకుంటున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమ సత్తా ఏమిటో తెలియజేయాల్సిన అవసరం ఉందని, అందుకే ఈనెల 6వ తేదీన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు చలో అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# రాజ్‌నాథ్ చేతుల మీదుగా.. ఐఎన్ఎస్ సంధాయక్ సర్వే నౌక జలప్రవేశం..



విశాఖ, ఫిబ్రవరి 3: ఐఎన్ఎస్ సంధాయక్ సర్వే నౌకను భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం ఇచ్చారు. ఈరోజు విశాఖలోని నేవల్ డాక్‌యార్డులో తూర్పు నౌకాదళ ముఖ్య కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్ఎస్ సంధాయక్ నౌకను జాతికి అంకితమిచ్చారు. హైడ్రోగ్రాఫిక్ సర్వే జరిపేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆదేశాలతో.. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డింగ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) సంస్థ 'ఐఎన్ఎస్ సంధాయక్' ను నిర్మించింది. ఇది 3,800 టన్నుల సామర్థ్యంతో 110 మీటర్ల పొడవుంది. హెలిపాడ్, సర్వే సాంకేతిక పరికరాలు, రెండు డీజిల్ యంత్రాలు అమర్చారు. తాజాగా దీన్ని జాతికి అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో నౌకాదళ అధిపతి అడ్మిరల్ ఆర్.హరి కుమార్, తూర్పు నౌకాదళ ప్రధాన అధికారి వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్కర్ పాల్గొన్నారు. సంధాయక్ నౌకకు కమాండింగ్ అధికారిగా కెప్టెన్ ఆర్.ఎం. థామస్ వ్యవహరించనున్నారు.

ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ..'భారత నౌకాదళ అమ్ములపొదిలో ఐఎన్ఎస్ సంధాయక్ జలప్రవేశం సంతోషకరం. భారత నౌకాదళం స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ప్రపంచ సముద్ర జలాల్లో కూడా భారత నౌకాదళం కీలక భద్రత చర్యలు చేపడుతోంది. భారత్‌కు ఎనిమిది వేల నాటికల్ మైళ్ల దూరంలో సముద్రపు దొంగలను కూడా నౌకాదళం అదుపు చేసింది. సముద్ర జలాల్లో శాంతి సామరస్యం పరిరక్షించడమే ఇండియన్ నేవీ లక్ష్యం. సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖ నగరం. తూర్పు నౌకాదళం విశాఖ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. విశాఖ గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. ఇండియన్ నేవీ విస్తరణలో విశాఖ నగర పాత్ర మరువ లేనిది' అని కామెంట్స్ చేశారు.

# రెండు వారాల అడ్వాన్స్‌డ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేయడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఔఅఉఉ), భారత ప్రభుత్వం యొక్క అత్యున్నత స్థాయి స్వయంప్రతిపత్త సంస్థ, ఆఫ్రికన్ ప్రాంతంలోని పౌర సేవకుల కోసం పబ్లిక్ పాలసీ మరియు గవర్నెన్స్‌పై రెండు వారాల అడ్వాన్స్‌డ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను 2-01-2024న పూర్తి చేసింది. కేంద్రం తొలిసారిగా నిర్వహించింది. ఐదు ఆఫ్రికన్ దేశాలు, ఎరిట్రియా, కెన్యా, ఇథియోపియా, టాంజానియా మరియు గాంబియా నుండి 34 మంది సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాల్గొన్నవారిలో మిస్టర్ టాంసిర్ ఆన్ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్, ప్రెసిడెంట్ ఆఫీస్, గాంబియా ప్రభుత్వం, శ్రీ మహత్ అబుకర్ యూసుఫ్ డైరెక్టర్ గరిస్సా కౌంటీ ఆఫ్ కెన్యా ప్రభుత్వం, శ్రీమతి తుమైని లువాండా మెటెటెమెలా యూనివర్సిటీ ఆఫ్ డోడోమ్మా ప్రిన్సిపల్ ఎగ్జామినేషన్ ఆఫీసర్ ఆఫ్ టాంజానియా ప్రభుత్వం, శ్రీమతి రహెల్ బెయెన్ టెక్లు ఉన్నారు. ప్రోటోకాల్ ఆఫీసర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ మినిస్ట్రీ ఆఫ్ ఎరిట్రియా ప్రభుత్వం, శ్రీమతి ఎట్మెట్ అసెఫా అసమ్రో, ఇథియోపియాలోని ఫెడరల్ సుప్రీం కోర్ట్ ప్రిసైడింగ్ జడ్జి.

శ్రీ వి. శ్రీనివాస్, డైరెక్టర్ జనరల్, నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఉ సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (DARPG), ఈ వేడుకలో ప్రసంగించారు. భారత్-ఆఫ్రికా మధ్య ఉన్న చారిత్రాత్మక బంధాన్ని, సంబంధాలను బలోపేతం చేసేందుకు ప్రధాని మోదీ హయాంలో చేసిన కృషిని ప్రదర్శించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పౌరులను మరియు ప్రభుత్వాన్ని దగ్గరకు తీసుకురావడం, భూ పరిపాలనలో న్యాయ పంపిణీ వ్యవస్థలను మెరుగుపరచడం, ప్రజల ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించడం మరియు గాంబియాలో MyGov పోర్టల్‌ను రూపొందించడం కోసం భారతదేశం యొక్క డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విధానాలను భాగస్వామ్య ప్రపంచ ప్రజా ప్రయోజనాల గురించి కూడా ఈ సెషన్ చర్చించింది. భారతీయ సహకారం. తమ దేశంలోని ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ప్రజల-కేంద్రీకృత పాలనను అందించడంలో సహాయపడే భారతదేశంలోని వివిధ సంస్థలతో సహకరించుకోవాల్సిన అవసరాన్ని ప్రతినిధులు వ్యక్తం చేశారు. ఆఫ్రికన్ ప్రాంతంలోని సివిల్ సర్వెంట్లకు రెండు వారాల వ్యవధితో భవిష్యత్తులో మరికొన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని కూడా వారు అభ్యర్థించారు.

కోర్సు కోఆర్డినేటర్ మరియు అసోసియేట్ ప్రొఫెసర్ NCGG డాక్టర్ ఎ.పి. సింగ్ స్వాగత ప్రసంగాన్ని అందించారు మరియు రెండు వారాల కార్యక్రమం యొక్క సమగ్ర అవలోకనాన్ని అందించారు, శిక్షణలో కవర్ చేయబడిన విభిన్న అంశాలను వివరించారు. ఈ ప్రోగ్రామ్‌లో గవర్నెన్స్ యొక్క మార్పు నమూనాలు, ఆధార్: సుపరిపాలన కోసం ఒక సాధనం, ల్యాండ్ రికార్డ్ ఆధునీకరణ, GeM, , స్వామిత్వ పథకం, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాలు, వాతావరణ మార్పు విధానాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల గురించి సెషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో పాల్గొనేవారికి ఎక్స్‌పోజర్ సందర్శనలలో పాల్గొనడానికి విలువైన అవకాశం ఉందని, ఇది వారి మొత్తం అభ్యాస ప్రయాణాన్ని పెంపొందించిందని అతను హైలైట్ చేశాడు. ప్రణాళికాబద్ధమైన పర్యటనలలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, DMRC, AIIMS, PM సంగ్రహాలయ మరియు తాజ్ మహల్ ఇతరాలు ఉన్నాయి.

కెపాసిటీ-బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.పి. సింగ్, అసోసియేట్ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ముఖేష్ భండారీ, ప్రోగ్రామ్ అసిస్టెంట్ శ్రీ సంజయ్ దత్ పంత్ మరియు NCGG యొక్క అంకితమైన కెపాసిటీ బిల్డింగ్ టీమ్ పర్యవేక్షించారు. 5-నేషన్ ఆఫ్రికా ప్రోగ్రామ్ యొక్క విజయవంతమైన ప్రవర్తన ITEC ప్రోగ్రామ్ కింద అంతర్జాతీయ పౌర సేవకుల కోసం అపెక్స్ కెపాసిటీ బిల్డింగ్ సంస్థగా దాని ప్రయత్నాలలో నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కోసం ఒక మైలురాయిని సూచిస్తుంది.

# గద్దర్ అవార్డుగా ప్రకటించడం పట్ల కళాకారుల హర్షం...

ఖమ్మం, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గద్దర్ అన్న జయంతి సందర్భంగా ఈ ఏడాది నుండి నంది అవార్డులుగా బదులు ప్రజాకవి గద్దర్ అవార్డుగా ప్రకటించడం పట్ల ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన జిల్లా కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తంబూరి దయాకర్ రెడ్డి ముఖ్యఅతిదిగా పాల్గొని కళాకారులను అభినందించారు. గద్దర్ అన్న అవార్డులుగా ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు గుడిపల్లి పుల్లారావు, ప్రధాన కార్యదర్శి అరెంపుల సతీష్, సహాయ కార్యదర్శి కాలంగి లలిత, ఉపాధ్యక్షులు చేకూరి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కొచ్చర్ల గురవయ్య, పుల్లయ్య, కర్ల బొడ్డు నరేష్, దప్పు శివ, గురవయ్య, అనిల్, వెంకన్న, సతీష్, తదితర కళాకారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలోని ఐఐఐటీలో డిజిటల్ ఇండియా ఫ్యూచర్‌ల్యాబ్స్‌ను ప్రారంభించిన మంత్రి రాజీవ్ చంద్రశేఖర్




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి, స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, మరియు జల్ శక్తి శాఖల సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ "డిజిటల్ ఇండియా ఫ్యూచర్‌ల్యాబ్స్"ని ప్రారంభించి, 'డిజిటల్ ఇండియా ఫ్యూచర్‌ల్యాబ్స్ సమ్మిట్ 2024'లో కీలక ప్రసంగం చేశారు. డిజిటల్ ఇండియా ఫ్యూచర్‌లాబ్స్ ద్వారా జనరేషన్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్.'

ఫ్యూచర్‌లాబ్‌ల అమలు కోసం పరిశ్రమతో C-DAC యొక్క 22 అవగాహన ఒప్పందాలను కూడా సమ్మిట్ చూసింది. ఎన్ఎక్స్‌పి సెమీకండక్టర్స్, టెన్‌స్టోరెంట్ మరియు క్వాల్కామ్ ఇండియా వంటి కంపెనీలు హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ స్పేస్, డిజైన్ ఉ ఇన్నోవేషన్ ఇన్ కంప్యూట్ స్పేస్ మరియు ఇండియన్ టెలికాం స్టాక్ వంటి రంగాలలో అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయి.

ప్రముఖ పరిశ్రమల ప్రముఖులు, స్టార్టప్‌లు, యువ భారతీయులు మరియు ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలోని విద్యావేత్తల సీనియర్ నాయకత్వంతో కూడిన సదస్సులో మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ప్రసంగించారు.

శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, "కాబట్టి గత పదేళ్లలో, భారతదేశ ప్రయాణం సాంకేతికతల వినియోగదారుగా మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెద్ద టెక్నాలజీ కంపెనీలకు ప్రతిభను అందించే దేశం నుండి ప్రతిభను ఖచ్చితంగా అందుబాటులో ఉండే దేశంగా మార్చింది. మేము మా టాలెంట్‌తో గ్లోబల్ కంపెనీలు మరియు ఎంటర్‌ప్రైజెస్‌కు మద్దతు నిస్తూనే ఉన్నాము, అదే సమయంలో మనకు మరియు ప్రపంచానికి సాంకేతికతలు, మేధోపరమైన లక్షణాలు మరియు పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ముందుంటాము. డిజిటల్ ఇండియా ఫ్యూచర్‌ల్యాబ్స్‌లో ప్రారంభమయ్యే సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ ఉ ఇన్నోవేషన్‌లకు ంఎలో స్టార్టప్‌ల తదుపరి తరంగాన్ని ఉత్ప్రేరకపరుస్తూ భారతదేశం యొక్క టెక్ ఉ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ విస్తరిస్తోంది మరియు అభివృద్ధి చెందుతోంది. డిజిటల్ ఇండియా ఫ్యూచర్‌ల్యాబ్స్ అనేది 2015లో డిజిటల్ ఇండియా ప్రోగ్రామ్ నుండి ఖఓ నరేంద్ర మోడీ జీ నిర్మించిన ఆవిష్కరణల కోసం ఆర్కిటెక్చర్‌లో చివరి భాగం. ఇది ఆటోమోటివ్, కంప్యూట్, టెలికాం, ఇండస్ట్రియల్ మరియు నెక్స్ట్‌జెన్ ఎలక్ట్రానిక్స్‌ను అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉన్న భారతీయ స్టార్టప్‌లకు ఒక అవకాశాన్ని సూచిస్తుంది. వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్. డిజిటల్ ఇండియా ఫ్యూచర్‌ల్యాబ్స్ దీనికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది మరియు అభివృద్ధి చెందుతున్న టెక్ ఇన్నోవేషన్‌లోని ప్రతి సెగ్మెంట్‌లో భారతీయ పతాకాన్ని నిర్ధారిస్తూ మా ఆశయాలను పూర్తి చేస్తుంది.మంత్రి కూడా ఇలా అన్నారు, "ఫ్యూచర్‌ల్యాబ్‌ల నుండి మనం ఆశించేది AT&T యొక్క బెల్ ల్యాబ్స్ మరియు నానోటెక్ వంటి అల్బానీలోని ఇతర ప్రయోగశాలల నుండి ఉద్భవించింది. ఈ అధిక-పనితీరు గల వ్యవస్థలు ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వం, సరసమైన, తక్కువ ధర మరియు విశ్వసనీయమైనవి. ఓపెన్‌నెస్, సేఫ్టీ మరియు ట్రస్ట్ అనేవి మా డిజిటల్ ఎకోసిస్టమ్‌లో విస్తృతంగా నిర్మించాలనుకుంటున్న సూత్రాలు. C-DAC సమన్వయంతో డిజిటల్ ఇండియా ఫ్యూచర్‌ల్యాబ్స్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ మరియు మాన్యుఫ్యాక్చరింగ్ (ESDM) రంగం అందించిన ట్రిలియన్-డాలర్ అవకాశాలను అందిపుచ్చుకోవడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చౌరవ విలువ గొలుసును పెంచడానికి, దేశీయ R&D ని బలోపేతం చేయడానికి మరియు దేశంలో ఐపిలు, ప్రమాణాలు మరియు తదుపరి తరం ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్‌ల అభివృద్ధికి సహకార పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి ప్రయత్నిస్తుంది.

కంప్యూట్, కమ్యూనికేషన్, ఆటోమోటివ్ & మొబిలిటీ, స్ట్రాటజిక్ ఎలక్ట్రానిక్స్ మరియు ఇండస్ట్రియల్ IoT వంటి కీలక వృద్ధి రంగాలపై దృష్టి సారించడం, FutureLABS చౌరవ వ్యూహాత్మకంగా AI బిగ్ డేటా మరియు క్వాంటం కంప్యూటింగ్‌తో సహా భవిష్యత్ సాంకేతికతలను ప్రభావితం చేయడానికి వ్యూహాత్మకంగా ఉంచబడింది. .

# 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో మనమే గెలవాలి- సీఎం జగన్



అమరావతి, ఫిబ్రవరి 3:రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో మనమే విజయం సాధించాలని సీఎం వైఎస్ జగన్ అన్నారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం సభలో ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి తరలి వచ్చిన పార్టీ కేడర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మరో చారిత్రక విజయాన్ని అందుకునేందుకు మీరంతా సిద్ధమేనా . ఇంటింటి చరితను.. పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చే పరిపాలన అందించేందుకు.. మన పార్టీని మరో సారి గెలిపించుకునేందుకు మరోసారి మీరంతా సిద్ధమేనా అని సీఎం జగన్ కేడర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు.

పేదల భవిష్యత్తులను, పేదల్ని కాటేసే యెల్లో వైరస్ మీద.. కనిపిస్తున్న కరోనా లాంటి ఆ దుష్టచతుష్టయంపై సంగ్రామానికి ప్రతీ ఒక్కరూ సిద్ధమేనా అని సీఎం జగన్ ప్రశ్నించారు. రామాయణం, మహాభారతంలో ఉన్న విలన్లు చంద్రబాబు అండ్ కో రూపంలో ఉన్నారు. వాళ్ళు.. ఆ తోడేళ్ల మంద వైపు నుంచి చూస్తే ఈ సీన్ చూస్తుంటే జగన్ ఒంటరి వాళ్లలా కనిపిస్తాడు. కానీ, నిజం ఏంటంటే.. ఇక్కడ జగన్ ఏనాడూ ఒంటరి కాదు. వారికి ఉన్న సైన్యం వారి పొత్తులు అయితే.. వారి యెల్లో పత్రికలైతే.. వారి యెల్లో టీవీలు అయితే.. నాకున్న తోడు, నా ధైర్యం, నా బలం.. పైనున్న దేవుడు.. ప్రజలు. ఇది నాకున్న బలమన్నారు.

ఇది నాయకుడి మీద నమ్మకం నుంచి పుట్టిన సైన్యం. ఒక నాయకుడిని ప్రజలు నమ్మారంటే.. ప్రజల ప్రేమ ఎలా ఉంటుందో అనేందుకు ఇదే నిదర్శనం. నా కుటుంబ సైన్యమంతా ఇక్కడ కనిపిస్తోందని సీఎం జగన్ అన్నారు. జరగబోయే ఎన్నికల రణక్షేత్రంలో కృష్ణావతారంలో కృష్ణుడి పాత్ర పోషిస్తూ మీరూ(ప్రజలు).. అర్జునుడిని నేను, చేసిన మంచంతా అస్త్రాలుగా కౌరవ సైన్యం మీద యుద్ధం చేద్దామంటూ పిలుపు ఇచ్చారు. పెత్తందారులు ఎవరిపై దాడి చేస్తున్నారో ఆలోచించండి. సంక్షేమం, అభివృద్ధిపై ప్రతిపక్షాలు దాడి చేస్తున్నాయి అని సీఎం జగన్ అన్నారు.

చంద్రబాబు మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యాడు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు మీకోసం ఏం చేశాడు ఏనాడైనా ఒక్క రూపాయి అయినా వేశాడా.. అని దెందులూరు సిద్ధం వేదిక నుంచి ప్రతిపక్ష నేతను సీఎం వైఎస్ జగన్ నిలదీశారు.

# ఖమ్మంలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన..

ఖమ్మం, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకి విశేష స్పందన లభించింది. యువతీ యువకులు భారీ ఎత్తున జాబ్ మేళాలో పాల్గొన్నారు.

69కి పైగా కంపెనీలు వచ్చాయని, 5000 జాబులున్నాయని స్థానిక మేనేజర్లు, హెచ్ఆర్ లు తెలిపారు హైదరాబాద్, ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నట్టు హెచ్ ఆర్ లు తెలుపుతున్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదివిన వారికి హైదరాబాద్ లో ఎక్కువగా జాబ్ లున్నాయని చెబుతున్నారు. ఖమ్మం నుంచి తదితర కంపెనీలు రిలయన్స్, ఎస్ బి ఐ లైఫ్, అపోలో, ఆర్కా హో ండా, టాటా ట్రెంట్ ఎల్టీడీ, మణప్పురం ఫైనాన్స్ ఎల్టీడీ, బ్యాంకు ఆఫ్ బరోడా, ఉడాన్, ఫ్యూచర్ ప్రాపర్టీ గ్రూప్, ఇన్నోవా సూపర్ ఎస్ బి ఐ కార్డ్స్, మయోర, మెట్ ప్లే, వివిధ కంపెనీలు ఉన్నాయి. ఈ జాబ్ మేళాకు వచ్చిన జనాన్ని చూస్తే ఎంతో మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని తెలుస్తోంది. ఏది ఏమైనా ఇప్పుడున్న ప్రభుత్వమైనా చొరవ తీసుకొని ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్స్ విడుదల చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అదేవిధంగా ఈ జాబ్ మేళాలో ఎక్కువగా వికలాంగులు పాల్గొన్నారు. కొందరు వికలాంగులు ఆ జనంలో ఇంటర్వ్యూకి వెళ్లలేక వెనుదిరిగి ఇంటికి వెళ్లిపోయారు.

# పంజాబ్ గవర్నర్, ఛండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ బన్వరిలాల్ పురోహిత్ రాజీనామా

న్యూఢిల్లీ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పంజాబ్ గవర్నర్, ఛండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ బన్వరిలాల్ పురోహిత్ రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలు, కొన్ని ఇతర కమిట్‌మెంట్ల రీత్యా పంజాబ్ గవర్నర్ పదవికి, ఛండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ పదవికి రాజీనామా చేస్తున్నానని, తన రాజీనామాను అంగీకరించాలని ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖలో పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ఆయన శుక్రవారంనాడు కలుసుకు న్నారు. ఛండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బీజేపీ ఇటీవల అనూహ్య విజయం సాధించింది. తక్కిన మూడు పదవులను కూడా నిలుపుకొంది.

# ఇండ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## - అసత్యప్రచారాలు మానుకొని ప్రజలకు సేవచేయాలి



ఖమ్మం, ఫిబ్రవరి 3:(నేటినిజం ప్రతినిధి): కొణిజర్ల మండలం పెద్ద మునగాల గ్రామంలో విష జ్వరాలు ప్రబలిస్తుడం వలన ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రతి వీదిలో డ్రైనేజ్ లు శుభ్రం చేస్తూ బ్లీచింగ్, ఫాగింగ్, పారిశుధ్య పనులు చేస్తున్నామని ప్రజలంతా ఆధైర్యపడవద్దని ఇండ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బందితో గ్రామంలో క్యాంప్ లు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, అసత్య ప్రచారాలు నమ్మవద్దని డెంగ్యుతో ఎవరు చనిపోలేదని గుండె నొప్పితో ఇద్దరు, కిడ్ని వ్యాధితో మరో కరు చనిపోయారని గ్రామంలో విష జ్వరాలు ఉన్నాయని కొంత మంది కావాలని అసత్య ప్రచారాలు చేస్తునా ్నరని రాజకీయాలు మాని ప్రజలకి సేవ చేయాలని పిలుపునిచ్చారు.

# జేఈఈ మెయిన్ సెషన్-2 దరఖాస్తులు ప్రారంభం..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:జాతీయ విద్యాసంస్థల్లో బీటెక్ సీట్ల భర్తీకి సంబంధించిన జేఈఈ మెయిన్ సెకండ్ సెషన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. మార్చి 2వ తేదీవరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. మొదటి సెషన్‌కు సంబంధించిన పరీక్షలను జనవరి 24 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఎన్‌టీఏ నిర్వహించిన విషయం తెలిసిందే. ఇక రెండో విడత పరీక్షలను ఏప్రిల్ 1-15 తేదీల మధ్య నిర్వహించనున్నట్లు ఎగ్జామ్ క్యాలెండర్ లో ఎన్‌టీఏ పేర్కొన్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన అడ్మిట్ కార్డులను పరీక్షలకు మూడు రోజుల ముందు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుంది.

జేఈఈ మెయిన్ ద్వారా దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఎన్‌ఐటీ, ఐఐటీలు, సీఎఫ్‌టీఐలలో ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. దీనికోసం ఏటా రెండుసార్లు జేఈఈ మెయిన్ పరీక్షను నిర్వహిస్తారు.

# గురువులతోనే కానిది.. శిష్యులతో అవుతుందా..? : వినోద్ కుమార్



హైదరాబాద్, ఫిబ్రవరి 3: తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని బొందపెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమట్‌రెడ్డి మాట్లాడుతున్నారని.. వీరిద్దరి గురువులైన చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలతోనే కాలేదని.. వీళ్లిద్దరితో ఏమవుతుందని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభ కార్యక్రమానికి మాజీ మంత్రి గంగుల కమలాకర్, జడ్పీ చైర్మన్ కనుమల్ల విజయతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ.. రాష్ట్రం కోసం పదవులను తృణపాయంగా వదిలేసిన చరిత్ర బీఆర్ఎస్‌దన్నారు. పార్లమెంట్‌లో ఇద్దరం ఎంపీలం ఉండి తెలంగాణ కోసం పోరాటం చేసినట్లు గుర్తు చేశారు.

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీళు ఇస్తామంటే నవ్వారని.. కృష్ణ, గోదావరి నదులపై పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులు కట్టి లక్షల ఎకరాలకు సాగునీళ్లిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వాని దేనన్నారు. తెలంగాణ రాక ముందు రాష్ట్రంలో 7,778 మెగావాట్ల విద్యుత్ ఉత్పతయ్యేదని.. రాష్ట్రం వచ్చాక విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నిర్మాణం చేసి పదేళ్లలో 26వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. దేశంలోనే వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేసి ప్రజలను మాయ చేశారని పేర్కొన్నారు.

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. గత ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు 50వేల మెజారిటీ ఇచ్చారని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా భారీ మెజారిటీ ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీలు చెప్పి ప్రజలను ఆగం చేసిందని, రైతు భరోసా రూ. 15వేలు, సిలిండర్ రూ. 500, మహిళలకు రూ. 2500, కల్యాణలక్ష్మి ద్వారా రూ. లక్షతో పాటు తులం బంగారం, ఉచిత బస్సు, 200 యూనిట్ల కరెంటు, క్వింటాల్‌కు రూ. 500 బోనస్, తదితర హామీలు ఇచ్చిందన్నారు. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఇచ్చిన వాటిని అమలు చేయాలన్నారు.

ఐదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఐదు పైసలు తేలేదని, కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి ఇచ్చే నిధులను తానే తెచ్చానని బండి సంజయ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలు రాగానే బండి సంజయ్‌కి గ్రామాలు గుర్తొస్తున్నాయని, ఐదేళ్లుగా ఎంపీగా ఉండి ప్రజా సమస్యలను గాలికొదిలేశారన్నారు. ఎంపీగా ఉండి బండి సంజయ్ పార్లమెంట్ పరిధిలో ఒక్క నవోదయ పాఠశాల, ట్రిబుల్ ఐటీ తేలేక పోయాడన్నారు. తాను 2014 నుంచి 2019 వరకు ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్ పట్టణానికి స్మార్ట్ సిటీ హోదా తెచ్చి కేంద్రం నుంచి రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయించి కరీంనగనగర్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని పేర్కొన్నారు.

# పీఠాధిపతులు, మఠాధిపతుల ఆశీస్సులతో మరింత గొప్పగా ధర్మ ప్రచారం : టీటీడీ చైర్మన్



తిరుపతి, ఫిబ్రవరి 3:మఠాధిపతులు, పీఠాధిపతుల సలహాలు, సూచనలతో సనాతన హిందూ ధర్మప్రచారాన్ని మరింత గొప్పగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్టు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుమల ఆస్థాన మండపంలో శనివారం వేంకటేశ్వర ధార్మిక సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భారతదేశం పవిత్ర భూమి అని, ఇక్కడే వేదాలు ఆవిర్భవించాయని, సాక్షాత్తు విష్ణుమూర్తి వారు శ్రీరామ, శ్రీకృష్ణ రూపాల్లో అవతరించారని చెప్పారు. ఈ దేశంలోనే ధర్మాచరణకు దిక్సూచిగా తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారు స్వయంభువుగా అవతరించారని అన్నారు. స్వామివారి ఆశీస్సులతో అనేక ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. హిందూ ధర్మాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేయడంలో భాగంగా పీఠాధిపతులు, స్వామిజీలు, భావసారూప్యం గల ఇతర హిందూ మత సంస్థల నిర్వాహకుల నుంచి సముచితమైన సూచనలను, సలహాలను స్వీకరిసామన్నారు. స్వామివారికి సంకీర్తనల సేవ అందించిన అన్నమాచార్యులు, పురందరదాసు , కనకదాసు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ పేర్లతో ప్రాజెక్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వామిజీల సూచనలతోనే ఎస్వీబీసీ ఛానల్ ఏర్పాటు చేసి ధర్మ ప్రచారానికి కొత్త అధ్యాయం ప్రారంభించామని గుర్తు చేశారు. వేద పరిరక్షణ కోసం వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజుల పాటు కొనసాగే సదస్సు సోమవారం ముగియనుంది.

# దామగుండంలో నేవీ రాడార్‌స్టేషన్ వద్దు :

## -లోక్‌సభలో ఎంపీ రంజిత్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:। చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణం వద్దని.. మరోచోటకు మార్చాలని బీఆర్ఎస్ ఎంపీ జీ రంజిత్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో కేంద్ర రక్షణ శాఖ పునరాలోచన చేయాలని సూచించారు. రూల్ 377 కింద లోక్‌సభలో ఎంపీ ఈ అంశాన్ని లేవనెత్తారు. దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మాణంతో 400 సంవత్సరాల పురాతనమైన రామలింగేశ్వర స్వామి దేవాలయం, విలువైన అటవీ, ఔషధ వృక్షాలు కాలగర్భంలో కలిసే ప్రమాదం దాంతోపాటు ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటయ్యాక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని స్థానిక ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు నెలకొన్నాయని స్పష్టం చేశారు. పూడురు మండల ప్రజానీకం నుంచి తీవ్ర అభ్యంతరాలు వస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఆయన పార్లమెంటరీ రూల్ 377 కింద లోక్‌సభలో ప్రత్యేకంగా రంజిత్ రెడ్డి లేవనెత్తారు. స్థానిక ప్రజలు ఆందోళనలను పరిశీలించి కేంద్ర రక్షణ తన నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. నేవీ రాడార్ స్టేషన్‌ను అక్కడి నుంచి మార్చి వేరే అనువైన ప్రదేశాలని మార్చాలని కోరారు. ఈ విషయంపై స్థానిక ప్రజలు గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.

# రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి కుష్టు వ్యాధి సోకే ప్రమాదం



హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అపరిశుభ్ర వాతావరణంలో ఉన్నవారికి, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి కుష్టు వ్యాధి సోకే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం అని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుని సంప్రదించాలని హిందూ కుష్టు నివారణ సంగ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయి చౌదరి అన్నారు. స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమం పక్షోత్సవాల సందర్భంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు వైద్యులు పక్షోత్సవాల నిర్వహించి వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పిస్తారని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ డాక్టర్ జీడీ నాయుడు అన్నారు. అనంతరం శ్రీరామ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది అని డాక్టర్ జీడీ నాయుడు తెలిపారు.

# వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీకి సిద్ధమైన పోకల కిరణ్ మాదిగ



హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); వరంగల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీకి పోకల కిరణ్ మాదిగ సిద్ధమైనారు. ఈ మేరకు గాంధీ భవన్ లో వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి కాంగ్రెస్ తరపున పోటీ చేయడానికి గాంధీభవన్లో దరఖాస్తు చేసుకున్నారు. గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నేతగా ఔజఎ యూత్ కాంగ్రెస్, ఎఔజఐ మరియు కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు నిరోహించి కాంగ్రెస్ పార్టీకి ఎంతో కృషి చేసారు

పోకల కిరణ్ మాది గారి జీవిత చరిత్ర ఒకసారి పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ తరపున వారి తల్లి 2001లో సర్పంచి గెలిచారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో 25 సంవత్సరాలుగా పోరాటాలు ఉద్యమాలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కి రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసినటువంటి అనుభవం తెలంగాణ ఉద్యమ పోరాటంలో భాగస్వామ్యం అనేక కేసులు జైలు జీవితం గడిపినటువంటి వ్యక్తిగా అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితం కలిగి వారితో దాదాపు 15 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం చేసి వారి రైతు పాదయాత్రలు మల్లన్న సాగర్ రైతుల గురించి రేవంత్ రెడ్డి గారితో కలిసి దీక్షలు అనేక సందర్భాల్లో రాస్తారోకోలు పిసిసి ఇచ్చిన పిలుపుకి కాంగ్రెస్ పార్టీ కి అనుబంధంగా మాదిగ జాతి ని అండగా నిలబెట్టి 2014, 18, 19, 2024 వరకు కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కృషి చేసారు. ఇదే విషయాన్ని కిరణ్ మాదిగ తానూ చేసిన సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ తనకే వరంగల్ టికెట్ కేటాయిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# నిజామాబాద్ లో కవిత మాట్లాడిన తీరుకి ఉసరవెల్లి కూడా సిగ్గు పడుతుంది

## -కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : కేసీఆర్ కుటుంబం తెలంగాణను లూటీ చేసిందని.. ఆ విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తోందని మండిపడ్డారు. తాను నిజామాబాద్ కొడలునని కవిత మాట్లాడిన తీరుకి ఉసరవెల్లి కూడా సిగ్గు పడుతుందని ఎద్దేవా చేశారు. కవిత మా జిల్లా కోడలు అని చెప్పుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజా పాలన అని వారే అంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఇంద్రవెల్లి సభ దోహదం చేసిందని తెలిపారు. నిన్న ఇంద్రవెల్లి సభ పార్టీ కార్యక్రమమని.. దానికి పార్టీ నుంచి ఖర్చు పెట్టామని అన్నారు. తమను కవిత లెక్కలు అడుగుతోందని.. బీఆర్ఎస్ తొమ్మిదిన్నర సంవత్సరాల పాలన లెక్కలను తాము కవితని అడుగుతున్నామని అన్నారు. పిల్లి కళ్లుమూసుకుని పాలు తాగినట్లు కవిత వ్యవహారం నడుస్తోందన్నారు.




# గ్రామీణులు కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మారు..

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 3: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి గెలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అయినా జీహెచ్‌ఎంసీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ జైత్రయాత్ర సాగించిందని శనివారం కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూకట్ పల్లి స్థానంలో గెలిచి బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించిందన్నారు.

చీకటి ఉంటేనే వెలుతురు తెలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన చూస్తే కాంగ్రెస్ పార్టీ పాలన అర్థం అవుతుందన్నారు. చిన్న పిల్లలు కూడా కాంగ్రెస్ పార్టీ హామీలను గుర్తు చేయాల్సిన బాధ్యత తమ పార్టీపై ఉందన్నారు. హైదరాబాదీ ఓటర్లు తెలివిగా అభివృద్ధికి ఓటేశారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీ మధ్య తేడా కేవలం 1.8 శాతమేనని గుర్తు చేశారు హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా ఇవ్వలేదన్నారు.

గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మారని కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 39 స్థానాలు వచ్చాయన్నారు. ప్రజలు మనకు ప్రతిపక్ష హోదా ఇచ్చారని, ఆ బాధ్యత నెరవేర్చాల్సిన బాధ్యత తమ పార్టీపై ఉందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మీద సీఎం రేవంత్ రెడ్డి నోరు పారేసుకుంటున్నాడని కేటీఆర్ ఆక్షేపించారు. తమకు నోరు ఉందని, వంద రోజుల వరకూ తామూ ఓపిక పడతామన్నారు. ఇప్పుడు హైదరాబాద్ గల్లీల్లోకి వాటర్ ట్యాంకర్లు వస్తున్నాయన్నారు.

# రెండు నెలల మీ పాలనలో రూ. 14వేల కోట్లు అప్పులా -రేవంత్ ను నిలదీసిన హరీష్ రావు



భద్రాచలం, ఫిబ్రవరి 3: బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పులపై మాట్లాడుతోన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలల కాకముందే రూ. 14 వేల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు మాజీ మంత్రి, బిఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు. భద్రాచలంలో నేడు బీఆర్ఎస్ కార్యకర్తలతో హరీష్ రావు పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 7 లక్షల కోట్ల అప్పు ఉందని రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు చెబుతున్నారని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లి రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పారని అన్నారు. కానీ మన్యాన్ని విష జ్వరాల నుంచి కాపాడింది బీఆర్ఎస్ అని గుర్తు చేశారు.

రాష్ట్ర కాంగ్రెస్ నేతలు నోరు తెరిస్తే అబద్ధమేనని ఆరోపించారు. అసెంబ్లీలోనూ అబద్ధాలే, ఆదిలాబాద్ లోనూ అబద్ధాలేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు నాలుగు మెడికల్ కాలేజీలు ఇచ్చింది బీఆర్ఎస్సే అని గుర్తు చేశారు. కాంగ్రెస్ తెచ్చిన మార్పు సున్నా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు తిట్ల పురాణం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఇదేనా కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు అని నిలదీశారు. రాష్ట్రంలో తిరోగమనం మొదలైందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్ అయ్యాయని చెప్పారు. అదానీతో కాంగ్రెస్ పార్టీ ఒప్పందాలు చేసుకున్నదని ఆరోపించారు.

దాసోజ్ శ్రవణ్, సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా తమ ప్రభుత్వం నామినేట్ చేస్తే గవర్నర్ తిరస్కరించారని ఆక్షేపించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించగానే ఆమోదించారు. ఎవరు ఎవరు కుమ్మక్కయ్యారని ప్రశ్నించారు. బీజేపీకి కాంగ్రెస్ పార్టీ ప్రత్యామ్నాయం కాదని బీఆర్ఎస్ పార్టీ మాత్రమే బీజేపీని ఢీకొట్టగలదని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ బీజేపీ కీలక నేతలు బండి సంజయ్, ఈటల రాజేందర్ . రఘునందన్ , దర్మపురి అరవింద్ , సోయం బాపూరావు లను బీఆర్ఎస్ పార్టీ ఓడించిందని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు సైతం హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి తలకిందులుగా తపస్సు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత దేశ ప్రధాని కాలేరని జోస్యం చెప్పారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రాకపోతే రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ అయ్యేవారే కాదని.. పీసీసీ చీఫ్ కాకపోతే ఆయన సీఎం అయ్యేవారే కాదన్నారు. ముఖ్యమంత్రి పదవి రేవంత్ రెడ్డికి కేసీఆర్ పెట్టిన భిక్ష అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

సీనియర్ సిటిజన్లకు ప్రకటించిన పెన్షన్ రూ. 4000 కాదు కదా.. ఇప్పటి వరకూ ఇచ్చిన రూ. 2000 పెన్షన్ కూడా ఇవ్వలేదని హరీశ్ రావు గుర్తు చేశారు. రోజూ కరంట్ ఆరు సార్లు పోతున్నదని ప్రజలు చెబుతున్నారని అన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలు అన్నీ ఇన్నీ కాదని, ఆరు లక్షల మంది ఆటో డ్రైవర్లను రోడ్ల మీదకు ఈడ్చారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రుణ మాఫీ హామీ సంగతేమిటని హరీశ్ రావు ప్రశ్నించారు. తిట్ల పురాణం తప్ప మీరు చేసిందేమిటని నిలదీశారు. రైతులకు రుణ మాఫీ హామీ ఏమైందన్నారు. ఈ నెల నుంచే రూ. 4000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణవాదం ఢిల్లీలో వినిపించాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మెజార్టీ సీట్లలో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# ఓటమి భయంతోనే అవాకులు, చెవాకులు పేలుతున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి

## -అర్జునుడు కాదు.. భస్మాసురుడు.. అచ్చెన్నాయుడు హాట్ కామెంట్స్

అమరావతి ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: సీఎం జగన్ రెడ్డి కు ఓటమి భయంతోనే అవాకులు, చెవాకులు పేలుతున్నారని ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నాడు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు సభలకు వస్తున్న ప్రజాదరణతో వైసీపీ ఫ్యాను రెక్కలు విరిగిపోతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజా వ్యతిరేక సునామీలో జగన్ రెడ్డి కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. ఓటు అనే ఆయుధంతో జగన్ రెడ్డికి ప్రజలు రాజకీయ సమాధి కట్టడం ఖాయమన్నారు. దెందులూరు సభలో జగన్ రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని విమర్శించారు. 57 నెలల్లో ఏపీని జగన్ సర్వనాశనం చేసి తమపై నిందలా? అని ప్రశ్నించారు. పన్నులు, ధరలు, ఛార్జీల పెంపుతో ప్రతి కుటుంబంపై రూ. 8 లక్షల భారం మోపిన పేదల ద్రోహి జగన్ రెడ్డి అని ధ్వజమెత్తారు. అబద్ధాల పునాదుల మీద పాలన చేస్తున్న జగన్ రెడ్డి అర్జునుడు కాదు...భస్మాసురుడు అని ఆరోపించారు. యుద్ధానికి ముందే ఓటమి ఒప్పుకున్న పిరికిపంద జగన్ రెడ్డి అని దెప్పిపొడిశారు. బాబాయ్(వివేకా)ను చంపి, తల్లి, చెల్లిని తరిమేసిన జగన్ రెడ్డి మహిళా పక్షపాతినా? అని నిలదీశారు. మూడు రాజధానుల పేరుతో ప్రజా రాజధాని అమరావతిని చంపేశాడని మండిపడ్డారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని ప్రశ్నార్థకం చేశారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో జగన్ రెడ్డి ఓటమి ఖాయమని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

